# తదనంతరం...

-శ్రీదేవి మురళీధర్

"మొన్న వైకుంఠ ఏకాదశి నాటికి నా రామకోటి పూర్తి చేసుకున్నాను" దగ్గుతెర తగ్గిన కాసేపటికి అన్నారు మాష్టారుగారు.

'అసలు ఈ జన్మలో నా వల్ల అవుతుందో కాదోనని ఎన్నోసార్లు దిగులుపడ్డాను' తనలో తాను అనుకుంటున్నట్లు నెమ్మదిగా చెప్పారాయన కూతురితో.

తృప్తిగా తల పంకించింది వైదేహి. తనకు ఊహ తెలిసినప్పటి నుంచీ నాన్న రామకోటి రాస్తున్నారు. పెదిమలపై నిరంతరం రామ నామ ధ్యానం. తల్లీ, అన్నయ్య రైలు ప్రమాదంలో చనిపోయినప్పడు మానవలసిన కొద్ది రోజులు మాత్రమే ఆయన రామ నామానికి దూరంగా ఉన్నది. గాలీ, నిద్రా, స్నానం, భోజనం లాగే రాముడ్ని ధ్యానించడం ఆయనకు ఒక జీవితావసరం. దశాబ్దాలుగా ఆయన చేస్తున్న నిరంతర తపస్సు.

మాష్టారుగారు బడిలో తెలుగు, సోషల్ చెప్పేవారు. ఇంటి దగ్గర ట్యూషన్లు, సంస్కృత పాఠాలు చెబుతారు. అత్యంత సామాన్య జీవనం కొనసాగించే ధార్మికుడు, కర్మిష్టి. తాతలనాటి చిన్న పెంకుటిల్లు ఆయనది. ఈనాడు మృగ్యమైన పాత బంగారపు విలువలు, పద్ధతులు ఆ ఇంట్లో కనిపిస్తాయి.

ఆయనకు ఒక కొడుకు, కూతురూను. కోదండపాణి ఎంకాం పాసై బ్యాంక్ ఉద్యోగంలో చేరాడు. తల్లీదండ్రీలేని మేనకోడల్ని తన కోడలిగా చేసుకున్నారు మాష్టారుగారు. పండంటి మనవడ్ని ఎత్తుకున్నారు.

మాష్టారుగారి రెండవ సంతానమైన వైదేహి. తండ్రికీ, కూతురికీ మధ్య మాటలకందని అనుబంధం. పద్దెనిమిదో ఏటనే పెళ్లి చేసారు. అల్లుడు మాష్టారుగారిలాగే సామాన్య కుటుంబీకుడు. ఏదో చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగం. పెళ్లయి పదిహేనేళ్లయినా వైదేహికి సంతానం కలగకపోవడం ఆయన జీవితంలో ఒక అపశ్రుతి.

భార్య, కొడుకు దుర్మరణం పాలుకావడాన్ని హాలాహలంలా మింగారాయన. తల్లీదండ్రీ లేక జీవిత భాగస్వామిని, తల్లిలాంటి అత్తగారిని పోగొట్టుకున్న కోడలి యొక్క సంరక్షణలో తన వ్యక్తిగత దుఃఖాన్ని పూర్తిగా పక్కకు నెట్టివేసారు. సుమతి ఆలనాపాలనా కన్నవారికంటే మిన్నగా కడుపులో పెట్టుకుని చేసారు. మామయ్య ఆదరణలో క్రమంగా కోలుకుని మామూలు మనిషైంది సుమతి.

రిటైరైన తరువాత వచ్చే పెన్షన్‌తో, ట్యూషన్లతో పాటుగా ఇంటి వెనుక వరండాని రెండుగదుల వాటాగా మార్చి అద్దెకిచ్చారు. అలా లోటు పడకుండా జాగ్రత్తగా రోజులు వెళ్లదీస్తున్నది ఆ కుటుంబం.

తండ్రి ధోవతులు మడత వేస్తూ "నాన్నా" అని పిలిచింది వైదేహి.

చేస్తున్న జపాన్ని ఆపకుండా కళ్లెత్తి చూసారాయన.

"ఏమీలేదు ఇదివరకు నాలుగైదుసార్లు అడిగాను మిమ్మల్ని, మర్చిపోయారేమో, అమ్మవి రాళ్లదుద్దులు" చెప్పడం ఆపి తండ్రి భావాల్ని చదవాలని చూసింది వైదేహి.

ఆయన విన్నారు. ఎప్పటిలా ఏమీ అనలేదు. తన మానాన తాను జపం చేసుకుంటున్నారు.

మళ్లీ గొంతు సవరించుకుంది. "ఏమిటి ఇన్నిసార్లు అడుగుతోందని అనుకోకండి నాన్నా, మీకు తెలినీదేముంది? తాళిబొట్టు తప్ప చిన్న మెత్తు బంగారం ఇక్కడా అక్కడా కూడా ఎరుగను. బంగారం కోసం కాదు, అమ్మ దుద్దులంటే నాకు ప్రాణం. ఆవిడ గుర్తుగా పెట్టుకుంటాను. కాదనకండి నాన్నా. ఆహా... ఇప్పటికిప్పుడు కాదు, ఎప్పుడైనా మీరు ఇవ్వదలచుకున్నప్పుడే" మనసు విప్పి తండ్రికి తన కోరిక చెప్పుకుంది వైదేహి.

"చూద్దాంలేవే. అయినా ఇప్పుడెందుకు చెప్పు అవన్నీ. దుద్దులు చూస్తేనే అమ్మ గుర్తొస్తుందిటే పిచ్చిదానా?" నవ్వుతూ తీసి పారేసారాయన.

మనసు చివుక్కుమంది. ఛ... నోరు తెరిచి ఎన్నిసార్లు అడిగినా ఇంతే. నాదే బుద్ధి తక్కువ అనుకుంది బాధగా. బయలుదేరడానికి లేచింది.

"సరే వెళ్లొస్తాను నాన్నా. అన్నీ సర్దిపెట్టాను. రేపటికి కావాల్సిన విస్తళ్లూ, కూరలు మీరు తెచ్చుకుంటానన్నారుగా. ఇంట్లో పని తెమలగానే తొందరగా వచ్చేస్తాను. ఒక పావుగంట ఆలస్యమైతే మీరిద్దరూ హైరానా పడకండి నాన్నా. అల్లుడ్ని భోజనాల వేళకి రమ్మను" నిట్టూర్చి వెళ్లిపోతున్న కూతురివంక ఆప్యాయంగా చూసారు మాష్టారు. తల్లిలాగే అలుపెరుగని కష్టజీవి. రోజూ విధిగా వచ్చి ఇంటి పనిలో చేదోడు వాదోడుగా ఉంటుంది. కోడలు సుమతి అర్భకురాలు. భార్య బతికున్నంతకాలం ఇంటెడు చాకిరీ తన ఒక్క చేతిమీదనే వెళ్ళబుచ్చింది. పై పనులు మగవాళ్లు చూసుకునేవారు. అటువంటి పరిస్థితిలో సుమతికి ఏనాడూ బాధ్యతల బరువులు తెలియలేదు. తనకు ఓపిక, ఆరోగ్యం రెండూ తక్కువేనని మనస్ఫూర్తిగా నమ్మిన సుమతి పనీ, ప్రయత్నం రెండూ మితంగానే చేసే అలవాటు చేసుకుంది. తండ్రి ఇంటి పరిస్థితి తెలిసిన వైదేహి తన విద్యుక్త ధర్మంగా చేతనైనంత చాకిరీ చేసి వెళ్తుంది ప్రతిరోజూ. రేపు తల్లి అన్నల ఆబ్దీకానికి అన్నీ చక్కబెట్టి వెళ్లిన కూతుర్ని భగవంతుడు తనకు మిగిల్చిన ఆఖరి ఆలంబనగా భావిస్తారు

మాష్టారు. జపం ముగించి లేచి కండువా భుజం మీద వేసుకుని చేతి సంచిలో ఏవో సామాన్లు సర్దుకుని కోడలికి తలుపు వేసుకొమ్మని చెప్పారు మాష్టారు.

"అలా కూరలు అవీ కొని ఘనాపాఠిగారింటికి వెళ్లొస్తానమ్మా. ఫలహారం కూడా అక్కడే ముగించుకుంటాను. పొద్దుపోతుంది... నువ్వూ పిల్లాడు తిని పడుకోండి'' చెప్పి బయలుదేరారు. బజారు పనులు చూసుకుని ఘనాపాఠిగారింటికి చేరుకున్నారు. ఆయన మాష్టారుగారికి గురుతుల్యులు. పెద్దదిక్కు. కష్టసుఖాల దగ్గరనుంచి ఈతిబాధల దాకా అన్నీ ఆయన దగ్గర వెళ్ళబోసుకుని ఆయన చెప్పే పరిష్కారాలు తు.చ తప్పకుండా శిరసావహించడం మాష్టారుకి అలవాటు.

బరువైన మనసుతో అక్కడికి వెళ్లి రాత్రి దాకా ఆయనతో మాట్లాడి ఇంటికి చేరుకునేసరికి బాగా అలసిపోయారు మాష్టారుగారు. ఆ ఇంట్లోనూ, ఈ ప్రపంచంతోనూ ఆయన గడిపిన ఆఖరి రాత్రి అదే.

★★★

ఆ ఇంటి చరిత్రలో మరొక అధ్యాయం ముగిసింది. యధావిధిగా మాష్టారి దశదిన కర్మలు జరిపించబడ్డాయి. బంధువులంతా వెళ్లిపోయాక కాలచక్రం ఆగిపోయినట్లుగా ఉన్నదక్కడ.



సాయంత్రపు నీడలు ముంగిట్లో పరచుకుంటున్నాయి. ఘనాపాఠిగారు మాష్టారి పెద్ద పడక కుర్చీలో కూర్చుని ఉన్నారు. ఆయన ముఖం ఎంతో గంభీరంగా ఉంది. మ్లాన వదనాలతో చిన్నబోయి కూర్చున్న సుమతి, వైదేహిలను చూసారాయన. పిల్లవాడు పక్క వాటా పిల్లలతో ఆడుకుంటున్నాడు.

పడక్కుర్చీ పక్కనే గట్టుమీద మాష్టారి చేతి సంచి ఉంది. దాన్ని ఇప్పుడు ఘనాపాఠిగారు తీసుకువచ్చారు. చనిపోయే ముందు రోజు రాత్రి దాన్ని మాష్టారు ఆయనకు అప్పజెప్పారు.

"అమ్మా సుమతీ, వైదేహీ! ఇలా రండమ్మా" అని దగ్గరకు పిలిచారాయన.

వైదేహి మనసులో ఎన్నో ఆశల అలలు. చనిపోయే ముందు రాత్రి తండ్రిని నోరు విప్పి కోరిన కోరిక ఆమెకు తరచూ గుర్తుకొస్తుంది. ఒకపక్క కన్నవారు, తోడబుట్టినవాడు శాశ్వతంగా దూరమైన ఒంటరితనం, అర్భకురాలైన వదిన, పసివాడైన మేనల్లుడి జీవితాలు ఆమెకు ప్రశ్నార్థకాలుగా మిగిలాయి. వారి బాధ్యత ఇకపై తనదేననే భావనే ఆమెలో భయాన్ని కలిగిస్తోంది. 'నా తరమా భవసాగరమీదగ' అన్నట్లు ఆమె మనసు పరివిధాలా పోతోంది.

ఘనాపాఠిగారు సంచీ విప్పి చిన్న స్టీలు భరిణ తీసారు. ఎన్నోసార్లు తండ్రిని తనికివ్వమని ప్రాధేయపడిన దుద్దులు అందులో వున్నాయి. అవి అందుకోవడానికి రెండడుగులు ముందుకు వేసింది వైదేహి.

"ఇవి మీ అమ్మగారి దుద్దుల జత. కోడలికి చెందాలని మీ నాన్న అభిమతం."

ఎదురుదెబ్బ తగిలినంత బాధ కలిగి విలవిలలాడింది వైదేహి. సుమతి ముందరకి వచ్చి అత్తగారి నగ ఇస్తోంటే చెంగుపట్టింది. కన్నీళ్లు, భావోద్వేగాలు వశం కాక వెక్కివెక్కి ఏడవసాగింది వైదేహి.

"ఎందుకమ్మా ఏడుస్తావు? ఎన్నాళ్లున్నా పోవలసిందేకదా. రోగాలు పాలై మంచం పట్టకుండా నిద్రలోనే దాటిపోయాడు పుణ్యాత్ముడు" అనునయంగా అన్నారు ఘనాపాఠిగారు.

ఇంకొక వస్తువును సంచీలోంచి తీసి వైదేహి వంక చూస్తూ సంచీ ఆమె వైపు జరిపారు.

"ఇదిగోనమ్మా వైదేహీ! మీ నాన్న నీ పేర వదిలిపెట్టిపోయిన ఆస్తి" ఆశ్చర్యంగా చూసిందామె.

మాష్టారి సచ్ఛీలత, క్రమశిక్షణ, వైరాగ్య వైఖరి గురించి కొన్ని మాటలు తనలో తాను గుర్తు చేసుకుంటున్నట్లు చెప్పారు ఘనాపాఠిగారు.

"సగం జీవితంపైగా ధారపోసి చేసిన రామనామం, రాసిన రామకోటి, ఈ రెంటి పుణ్యఫలం నీకు ధారపోసి వెళ్లిపోయాడమ్మా నీ తండ్రి. ఆ రామనామం సాయంతోనే పిడుగులాంటి కష్టాల్ని ఎదుర్కొన్నాడు. దాని ఆలంబనతోనే ముసలితనాన్ని, అనారోగ్యాన్ని లెక్క చేయకుండా బతకడం అలవాటు చేసుకున్నాడు. తను చేసుకున్న పుణ్యమంతా నీ పరం చేసి ఉట్టి చేతులతో దర్జాగా దాటిపోయాడమ్మా"

తండ్రి జపమాలను ఎంతో అపురూపంగా చెంపకు చేర్చుకుంది వైదేహి. ఏళ్ల తరబడి రాసిన రామకోటి పుస్తకాల సంచీ ఆమె దగ్గరకు జరిపారాయన. 'చిరంజీవి సౌభాగ్యవతి వైదేహికి' అని చక్కటి ముత్యాల వంటి దస్తూరితో తండ్రి వ్రాసిన ఆఖరి అక్షరాలు.

తాను కోరుకున్నది భగవంతుడు ఇవ్వలేదనే బాధ స్థానంలో తనకు అయాచితంగా దక్కిన దాని విలువను ఆమె మనసు గ్రహించడం మొదలుపెట్టింది. కోరుకున్నదీ, లభించినదీ వీటి రెంటి మధ్య వ్యత్యాసం దానంతట అదే ఆమెకు బోధపడసాగింది. రాళ్లడిగితే రత్నాలు దక్కాయిట.

'ఎందుకు అడిగాను నాన్నను అన్నిసార్లు? ఎందుకు?' పదేపదే ఆమె మనస్సు కలత పడుతోంది.

అన్నీ తెలిసిన ఘనాపాఠిగారు "పిల్లలకు ఎవరికేది ఇవ్వాలో తండ్రి కంటే ఎక్కువ ఎవరికి తెలుస్తుందమ్మా?" అర్థయుక్తంగా అన్నారాయన.

శక్తికి మించిన బాధ్యతలు తలకెత్తుకువలసి వస్తే అవసరపడే చేయూత తండ్రి ద్వారా తనకు సంక్రమించిందనిపించింది వైదేహికి.

కోడలు పెట్టిన దీపం వెలుగులో మాష్టారుగారు ఫోటోలోంచి ప్రశాంతంగా, సంతృప్తిగా బిడ్డలవైపు చూస్తున్నారు.

అప్పజెప్పిన బాధ్యత నిర్వర్తించి ఘనాపాఠిగారు నెమ్మదిగా అక్కడి నుంచి బయలుదేరుతున్నారు.

మేనల్లుణ్ణి పొదవి పట్టుకుని వైదేహి వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది.

★



## చెట్లెక్కిన విమానం

ఇటీవల 1930 నాటి సింగిల్ ఇంజన్ అమెరికన్ విమానం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన కాసేపటికే ఎత్తు కోల్పోయి రన్‌వేకి 200 అడుగుల దూరంలో భూమికి 50 అడుగుల ఎత్తున వున్న చెట్ల గుబురులో దిగిపోయిందిట. వెయ్యి పౌండ్లకన్నా ఎక్కువ బరువులేని ఆ విమానాన్ని ఆ చెట్ల చివళ్లు తట్టుకుని రక్షించాయి. పైలెట్‌తోపాటు అతని తోటి ప్రయాణీకుడు కొన్ని గంటలసేపు ఆ చెట్లపైనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ తరువాత ఫైర్ సర్వీస్‌వారు వచ్చి హెలికాప్టర్ సాయంతో వాళ్లను కాపాడారు. ఆ తరువాత క్రేన్ సాయంతో ఆ విమానాన్ని రికవర్ చేసారుట.

-తటవర్తి

